# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**జనవరి 9, 2018**

## బ్రాహ్మణీయ దాష్టీకానికి, దళితుల ఆత్మగౌరవానికి ప్రతిబింబం కోరేగాం భీమా

మహారాష్ట్రలోని కోరేగాం భీమాలో జనవరి ఒకటి నాడు తమ చారిత్రక విజయదినాన్ని జరుపుకోవడానికి చేరిన వేలాది దళిత, ప్రజాస్వామిక, లౌకిక శక్తులపై మతోన్మాద హిందుత్వ శక్తులు మారణాయుధాలతో దాడిచేసి దళితుల ఆత్మగౌరవ ప్రతీకగా సాగే ఉత్సవాన్ని విధ్వంసం చేయడాన్ని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. దుష్ట మతోన్మాద బ్రాహ్మణీయ శక్తులపై ధైర్యంగా పోరాడి ఓడించకుండా దళిత, ఆదివాసీ, మతమైనార్టీ ప్రజల అస్థిత్వానికి, ఆత్మగౌరవానికి ముప్పుగా పరిణమించిన హిందుత్వ పెను ప్రమాదాన్ని నివారించలేం.

మహారాష్ట్రలో శివాజీ పాలన 1674-80 మధ్య సాగింది. ఆ తర్వాత మరాఠాల పాలన పీష్వాల నాయకత్వంలో సాగింది. మరాఠాలు మొగల్ రాజుల దాడులను ఓడించినప్పటికీ బ్రిటిష్ సైన్యాలను ఎదుర్కోలేక పోయారు. మరాఠాలను ఓడించిన బ్రిటిష్ వారు పూణేను తమ సైనిక, పరిపాలనా కేంద్రంగా ఏర్పర్చుకున్నారు. 19వ శతాబ్దం మొదటి పాదంలో పీష్వాలు తమ 28వేల సైన్యాలను తీసుకొని పూణేను ఆక్రమించుకోచూడగా బ్రిటిష్ సైన్యాలు 12 గంటలు ప్రతిఘటించి పూణేను వారికి స్వాధీనం కానివ్వలేదు. ఆనాటి బ్రిటిష్ సైన్యంలో ఉండి పీష్వాలను ప్రతిఘటించిన వారంతా భారతీయ దళితులే. దళితుల చేతిలో పీష్వాలు ఓటమి పాలు గావడాన్ని బ్రిటిష్ వారితో ప్రమేయం లేకుండానే తమ విజయదినంగా, ఆత్మగౌరవ చిహ్నంగా జనవరి ఒకటిని దళితులు గత రెండు శతాబ్దాలుగా పాటిస్తున్నారు. ఇలా వారు ఏటేటా పాటించడం బ్రాహ్మణీయ శక్తులకు మింగుడుపడని వ్యవహారంగా ఉంది. రాష్ట్రంలో, కేంద్రంలో తమ సత్తానే నడుస్తోందన్న అధికారమదంతో ఈసారి 1 జనవరి 2018 నాడు హిందుత్వ గుండాలు శంభాజీ బీడే, మిలింద్ లింబోడీల నాయకత్వంలో వారి గ్యాంగులు కోరేగాం భీమాకు చేరిన దళితులపై, వారి సమర్థకులపై మారణాయుధాలతో దాడి చేశారు. పదుల సంఖ్యలో కాషాయ ఉగ్రవాద శక్తులు కుక్కర్ బాంబులను పేల్చి ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించారు. కోరేగాం ప్రజలలో భయభీతావహాన్ని ఏర్పర్చారు. ఆ దాడుల్లో ఒక దళిత యువకుడు ప్రాణాలు కోల్పోగా అనేక మంది గాయపడినారు. చాలా ముందు నుండే దళిత సంఘాల నాయకులు తమ వేడుకల నిర్వహణ గురించి ప్రభుత్వానికి, పోలీసులకు తెలిపినప్పటికీ వారు సరైన భద్రతా చర్యలు చేపట్టకుండా హిందుత్వ గుండాల దాడులను ప్రోత్సహించారు. దళితులకు గట్టిగా బుద్ధిచెప్పి ఇక ముందు వారు ఎలాంటి ఆత్మగౌరవ విజయదినాలకు పూనుకోకుండా చేయడానికే ప్రభుత్వం, పోలీసులు కాషాయ ఉగ్రవాద గూండాల దాడులను ప్రోత్సహించారు. నిజానికి ఇవన్నీ ఒక సునియోజిత పథకం ప్రకారమే సాగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, వారి ఇంటెలిజెన్స్ వర్గాల, సంఘ్ ముఠా శక్తుల సంయుక్త దుష్టపథకాన్నే శంభాజీ, మిలింద్‌ల గ్యాంగులు అమలు చేశాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కాషాయ కుటిల ఎత్తుగడలను దేశవ్యాప్తంగా ఎండగట్టాల్సిందిగా మా పార్టీ దళిత, ఆదివాసీ, అల్పసంఖ్యాక ప్రజలను, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను కోరుతోంది.

కోరేగాం భీమాలో దళితులపై జరిగిన దాడులను ఖండిస్తూ పదుల సంఖ్యలో దళిత, ప్రజాస్వామిక, లౌకిక, ప్రగతిశీల, హేతువాద, విప్లవ సంఘాలు జనవరి 3 నాడు మహారాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. రాష్ట్రవ్యాపితంగానే కాకుండా దేశవ్యాప్తంగా హిందుత్వ దాడులకు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అనేక చోట్ల ప్రజలు ప్రభుత్వ వ్యతిరేక సమరశీల చర్యలకు దిగారు. బంద్‌కు పిలుపునిచ్చిన ముఖ్యులలో ఉన్న కామ్రేడ్ ప్రకాష్ అంబేద్కర్, ఆయన నాయకత్వంలోని భారతీయ రిపబ్లికన్ పార్టీ ప్రజల నిరసన చర్యలతో బెంబేలు పడిపోయి బంద్‌ను ఉపసంహరించుకోవడం విచారకరం. కాషాయ ఉగ్రవాదులు బాంబులు, తుపాకులు పేలుస్తూ, కర్రలతో తలలు పగులగొడుతూ, స్త్రీ-పురుష భేదం లేకుండా దాడులు చేసిన విషయాన్ని పక్కనబెట్టి దానికి నిరసనగా ప్రజలు ఉద్యమిస్తే వారి మిలిటెంట్ చర్యలతో కంగారు పడిపోయి, దగుల్బాజీ హిందుత్వ నాయకుల హామీలతో ఆత్మసంతృప్తి చెంది బంద్‌ను నిలిపివేయడాన్ని ఎవరూ హర్షించరు.

కోరేగాం భీమాలో దళితులపై దాడికి దిగిన గూండాలు శంభాజీ బీడే, మిలింద్ లింబోడీలు ఇప్పటికీ స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వారు 'ప్రజల ప్రధాన సేవకుడు' మోదీకి ఎంతటి సన్నిహిత అనుచరులనే విషయం 2014 ఎన్నికల ప్రచార ర్యాలీలను గుర్తు చేసుకుంటే తెలుస్తుంది. ఇది ఇలా ఉండగా దళితుల ఆత్మగౌరవాన్ని ఎత్తిపడుతూ వారికి అండగా నిల్చిన గుజరాత్ ప్రజల యువనాయకుడు జిగ్నేష్ మేవానీ, జెఎన్‌యు విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్ సహ అనేక మందిని మహారాష్ట్ర పోలీసులు ముంబాయిలో అరెస్టు చేసి తప్పుడు కేసులలో ఇరికించడాన్ని మాపార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది.

దళితుల ఉద్ధరణ గురించి హిందుత్వ మోదీ మాట్లాడడం, పీడిత ప్రజల పక్షపాతి అంబేద్కర్‌ను తన కుటిల ఎత్తుగడలతో ఎత్తిపట్టడం హిందుత్వ కుట్రలో భాగమే తప్ప మరేమీ కాదు. బ్రాహ్మణీయ చాతుర్వర్ణ వ్యవస్థను, కులవ్యవస్థను, అంటరానితనాన్ని భగవద్గీత వలే ఎవరి 'ధర్మం' వారు పాటించాలని బోధించే అపర మనువు మోదీకి అంబేద్కర్‌ని ప్రశంసించే నైతిక అర్హతే లేదనీ, దళితుల గురించి పల్లెత్తు మాట మాట్లాడితే సహించేది లేదని ముక్తకంఠంతో నినదిద్దాం. రోహిత్ వేముల నుండి కోరేగాం భీమాలో దళిత యువకుడి హత్య వరకు నెత్తుటి మరకలతో పాలన సాగిస్తున్న హిందుత్వ శక్తుల ఆగడాలకు వ్యతిరేకంగా పీడిత ప్రజలంతా సమైక్యంగా సంఘటితంగా పోరాడాలని మా పార్టీ కోరుతోంది. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే బ్రాహ్మణవాద అవకాశవాద రాజకీయాల ద్రోహాన్ని ఎండగడుతూ ప్రజాస్వామిక, లౌకిక, ప్రగతిశీల శక్తులన్నీ ప్రజాపోరాటాలకు అండగా నిలవాల్సిన

తరుణమిది. ఈ దేశంలో మతానికి, కులానికి తావులేని నవభారతాన్ని 2022 నాటికి నిర్మిస్తానంటూ మోదీ చెప్పేదంతా సొల్లు వాగుడే. ప్రజల కష్టాలను, కడగండ్లను, దోపిడీని నిర్మూలించి, కులమత భేదాలకు, లింగ భేదాలకు అవకాశముండని నూతన ప్రజాస్వామిక సమాజ నిర్మాణానికి పోరాడకుండా ఏ నవభారతం నిర్మాణం కాదని మా పార్టీ స్పష్టం చేస్తున్నది.

**అభయ్, అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ,**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**